క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: కిస్మత్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ కోత విధిస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ హాథిరాం తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు ఈ కోత ఉంటుందన్నారు. మరమ్మతుల కారణంగా కిస్మత్‌పూర్, డిఫెన్స్ కాలనీ, సాయిబాబానగర్ కాలనీ, శ్రీకృష్ణ కాలనీ, ఓమ్‌నగర్, ఎస్‌ఆర్‌ఐ కాలనీ, భోగిరెడ్డిఫామ్స్, ఫైన్ ఆర్ట్స్ కాలనీ, దళిత బస్తీ, గిరిధారి అపార్ట్‌మెంట్ దుర్గా కెకె గూడ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

డైరీ, కేలండర్ ఆవిష్కరణ



ఎస్టీ ఎంప్లాయీస్ డైరీ, కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ఎస్టీ ఎంప్లాయీస్ నూతన సంవత్సర డైరీ, కేలండర్‌ను సోమవారం స్థానిక మేయర్ మహేందర్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు సంఘటితంగా సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఎస్టీ ఎంప్లాయీస్ నూతన సంవత్సర కేలండర్, డైరీ ఏర్పాటు చేసుకోవడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన రంగనాథస్వామి ఆలయ ఉత్సవాలు

గోల్కొండ: నానల్‌నగర్ సాలార్జంగ్ కాలనీలోని శ్రీ కోవెల రంగనాయకస్వామి ఆలయ సంక్రాంతి జాతర 3 రోజుల ఉత్సవాలు సోమవారం ముగిశాయి. చివరి రోజున స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరాజు తెలిపారు. కరోనా తర్వాత ఇంత పెద్దెత్తున ఉత్సవాలు జరగడం స్వామి వారిపై భక్తులకు నమ్మకానికి నిదర్శమన్నారు. కాగా బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి అమర్‌సింగ్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్. జనార్దన్, శ్రీకాంత్, నర్సింహా తదితరులున్నారు.

'కోట' కిటకిట



గోల్కొండ: గోల్కొండ కోట పర్యాటకులతో కిటకిటలాడింది. పాఠశాలలు, కళాశాలలకు సెలవు కావడంతో విద్యార్థులు భారీ ఎత్తున కోటకు తరలివచ్చారు. ఇదిలా ఉండగా ఉదయం నుంచి సాయంత్రం వరకు కోటలోని అన్ని ప్రాంతాల్లో విద్యార్థులు సందడి చేశారు. వారికి గోల్కొండ హిస్టరీ ఒక్కొక్క కట్టడం విశేషాలు వివరించారు. భారీ రాళ్లతో నిర్మించిన భక్తరామదాసు చెరసాలను చూసి విద్యార్థులు ఆశ్చర్యపోయారు. మరోవైపు కుటుంబాలతో వచ్చిన వారు కోటలోని నగీనాబాగ్ కొత్త రూపును సంతరించుకున్నారు. కోటలోని రాణీ మహల్, క్లాపింగ్ పోర్టికో వద్ద యువజంటలు సెల్ఫీలు తీసుకుంటూ సంబురపడ్డారు.

గో సంరక్షణకు కృషి

అబిడ్స్: నగరంతో పాటు తెలంగాణ రాష్ట్ర నలుమూలలా గోవుల సంరక్షణకు, గో ఉత్పత్తులకు విశేషంగా కృషి చేస్తున్నట్లు టీటీడీ గో సంరక్షణదళ్ తెలంగాణ రాష్ట్ర సభ్యుడు కోటి శ్రీధర్ పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల్లో గో ఉత్పత్తులను పెంపొందిస్తూ నిరంతరం అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సోమవారం తిరుపతిలోని ఎస్.వి. గోశాలలో జరిగిన గో పూజలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటి శ్రీధర్ మాట్లాడుతూ.. నగరంలో నిరంతరం గో సంరక్షణకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామ్, సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ కృషి

అబిడ్స్: క్రీడా సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకుడు నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. సిక్వాల్ బ్రహ్మణ్ యువ సమితి ఎస్.పీ.ఎల్- 2023 క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. క్రీడాకారుల సంక్షేమానికి ప్రభుత్వం దేశంలోనే అగ్రగామిగా విశేషంగా కృషి చేస్తుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి దేశంలోని పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. సిక్వాల్ సమితి క్రీడాకారులతో పాటు గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా క్రీడాకారుల సంక్షేమానికి నిరంతర తన సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చేతన్ తివారి, కైలాష్ వ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టికెట్ల విక్రయాలు షురూ

- గచ్చిబౌలి స్టేడియంలో సందడిలేని వాతావరణం
- విక్రయానికి భారీగా ఏర్పాట్లు
- రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 వరకు విక్రయాలు..
- మ్యాచ్ రోజు వరకు విక్రయాలు కొనసాగింపు
- ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకున్న వారు ఆధార్‌కార్డు తీసుకొస్తేనే టికెట్..



గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలోకి టికెట్ల కోసం వస్తున్న క్రికెట్ అభిమానులు

హఫీజ్‌పేట్: నగరంలో క్రికెట్ సందడి మొదలైంది. బుధవారం ఇండియా–న్యూజిలాండ్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ కొనసాగుతుండడంతో క్రికెట్ అభిమానుల టికెట్ల కోసం బారులు తీరి నిల్చున్న దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. కౌంటర్ల సంఖ్య పెంచినా రద్దీ లేని వాతావరణంలో టికెట్ల అందజేత సాఫీగా కొనసాగుతోంది. నిర్వహకులు, క్రికెట్ అభిమానులు ముఖ్యంగా పోలీసులకు ఎలాంటి సమస్యలు లేకుండా పోయాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియాన్ని టికెట్ల విక్రయం కోసం ఎంపిక చేశారు. టికెట్ల విక్రయానికి పేటీఎం వారు గచ్చిబౌలి స్టేడియంలో భారీగా ఏర్పాట్లు చేశారు. అభిమానులకు గత మ్యాచ్ సందర్భంగా ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, పేటీఎం వారు సంయుక్తంగా ఈ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో టికెట్లను బుక్ చేసుకున్న వారికి మాత్రమే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా టికెట్లను అందించాలని నిర్ణయించడంతో ఎలాంటి సమస్యలు లేకుండా సాధాసీదాగా టికట్ల అందజేత కార్యక్రమం సాగుతోంది. ఎలాంటి సందడి లేకుండా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారు ఆధార్‌కార్డు తీసుకొచ్చి తమ టికెట్లను పొందుతూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

టికెట్ల విక్రయ వివరాలు...

- గచ్చిబౌలి స్టేడియంలో ప్రతిరోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విక్రయాలు.
- ఆన్‌లైన్‌లో టికెట్లను బుక్ చేసుకున్నవారిలో ఆధార్‌కార్డు తీసుకొచ్చిన వారికి అందజేత
- ఈనెల 18వ తేదీ మ్యాచ్ రోజు వరకు ఈ టికెట్ల విక్రయాల కొనసాగింపు.
- టికెట్ల విక్రయం కోసం ప్రత్యేకంగా 8 కౌంటర్ల ఏర్పాటు.
- కౌంటర్ల వద్ద బారులు తీరి నిల్చునేలా బారికేడ్ల ఏర్పాటు.
- రెండు రోజుల్లో 7వేల టికెట్ల విక్రయం.
- ఆదివారం రోజు 5వేల మందికి టికెట్ల అందజేత.
- సోమవారం 2వేల టికెట్ల అందజేత.
- ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల వరకు సైట్ ఓపెన్‌గా ఉంటుంది. అందులో టికెట్లను బుక్ చేసుకున్న వారికి మరుసటిరోజు టికెట్లను ఈ కౌంటర్ ద్వారా అందజేత.



టికెట్ల విక్రయానికి వినియోగదారులు లైన్‌లో నిల్చొనేందుకు ఏర్పాటు చేసిన దృశ్యం



క్రికెట్ మ్యాచ్ టికెట్లను కౌంటర్ల ద్వారా పొందుతున్న క్రికెట్ అభిమానులు

చాలా సంతోషంగా ఉంది...



నేను మల్కాజ్‌గిరి నుంచి వచ్చా. ఎల్‌బి స్టేడియంలో టికెట్లు తీసుకోవడానికి ప్రయత్నించా. కానీ లింక్ ఓపెన్ కాలేదు. అందుకే గచ్చిబౌలి స్టేడియంకు వచ్చి టికెట్లు తీసుకున్నందుకు ఆనందంగా ఉంది. గత ఏడాది మ్యాచ్ టికెట్ల కోసం తీవ్ర ఇబ్బందిపడ్డాం కానీ ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేకుండా టికెట్లు తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది.

– డాక్టర్ విజయ్, మల్కాజ్‌గిరి

ఇబ్బందులు లేకుండా టికెట్లు దొరికాయి...



భారత్, న్యూజిలాండ్ మ్యాచ్ టికెట్ల కోసం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆన్‌లైన్ ద్వారా టికెట్ల విక్రయించడం చాలా సులభంగా ఉంది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా గచ్చిబౌలి స్టేడియంకి వచ్చి టికెట్లు తీసుకోవడం ఆనందంగా ఉంది. క్రమబద్ధమైన ఏర్పాట్లు చేయడంతో ఎలాంటి ఇబ్బందులు కలగలేదు.

– శ్రవణ్, ఫొటోగ్రఫర్, జూబ్లీహిల్స్

మహబూబ్‌నగర్ నుంచి వచ్చాం...

మహబూబ్‌నగర్ నుంచి నలుగురు స్నేహితులతో కలిసి గచ్చిబౌలికి టికెట్ల కోసం వచ్చాం. హైదరాబాద్‌లో జరిగే ప్రతి మ్యాచ్ తిలకించడానికి స్నేహితులతో కలిసి వస్తుంటా. పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా టికెట్లు అమ్మడం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నందుకు సంతోషిస్తున్నా. గత మ్యాచ్ టికెట్ల కోసం చాలా ఇబ్బందులకు గురై టికెట్లు కొనుగోలు చేశాం. ఇప్పుడు ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొందడం చాలా సులభంగా, సునాయసంగా ఉంది.

– రవి ప్రకాష్, ప్రైవేట్ ఉద్యోగి, మహబూబ్‌నగర్

చౌడమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



అమ్మవారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

రాజేంద్రనగర్: చౌడమ్మ గుట్టపై అమ్మవారి జాతర ఘనంగా జరుగుతోంది. సంక్రాంతి అనంతరం ఈ గుట్టపై జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. కనుమ సందర్భంగా తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరం నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో గుట్ట కిటకిటలాడింది. ఉదయం కార్పొరేటర్లు తోకల శ్రీనివాస్‌రెడ్డి, మోంద్ర సంగీత గౌరీశంకర్‌తో పాటు శ్రీనివాస సేవా సమితి వ్యవస్థాపకులు సాయిమాలిక్, రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ నాగేందర్‌బాబు, నాయకులు, కార్యకర్తలు అమ్మవారిని దర్శించుకున్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా దేవాలయ కమిటీ సభ్యులు సత్యనారాయణ ముదిరాజ్, శేఖర్‌యాదవ్, నరేష్‌యాదవ్, రమేష్‌యాదవ్, పయాజ్, మల్లేష్‌యాదవ్ తదితరులు భారీ ఏర్పాట్లు చేపట్టారు.



కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బండ్లగూడ: రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. హిమాయత్‌సాగర్‌కు చెందిన నలుగురు కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు కార్పొరేటర్ ముద్దం రాముతో కలిసి సోమవారం ఆయన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆడపడుచులకు పెద్దన్నగా ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. లబ్ధిదారులు ధర ఖాస్తు చేసుకున్న వెంటనే చెక్కులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ప్రజలకు అండగా ఉంటూ అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఉదయ్, లబ్ధిదారులు, నాయకులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

ఉత్తమ వ్యవసాయదారులకు జాతీయ స్థాయి అవార్డులు

ఏజీవర్సిటీ: జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్) ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో యువ వ్యవసాయ దారులను జాతీయ స్థాయి ఉత్తమ అవార్డులతో సత్కరించారు. అగ్రి క్లినిక్స్, అగ్రి బిజినెస్ కింది శిక్షణ పొందిన 82 మంది ఉత్తమ అగ్రిప్రెన్యూర్‌లకు జాతీయ అవార్డులను అందజేశారు. భారత ప్రభుత్వం వ్యవసాయ క్లినిక్, అగ్రిబిజినెస్ సేవల ద్వారా రైతులకు గణనీయమైన సహకారం అందించేందుకు జాతీయ స్థాయిలో 8 నోడల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లను ఏర్పాటు చేసినట్లు మేనేజ్ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. మేనేజ్‌లో ఇప్పటి వరకు 83 810 మంది అగ్రి గ్రాడ్యుయేట్లు శిక్షణ ఇవ్వడం జరిగిందని 36560 అగ్రి వెంచర్లను స్థాపించడం జరిగిందన్నారు. రైతులకు సేవలు అందించడం ద్వారా స్వయం ఉపాధిని సాధించడంతో పాటు గ్రామీణ యువతకు ఉద్యోగాలు కల్పించగలుతున్నామన్నారు. వీటితో పాటు ఉత్తమ అగ్రిప్రెన్యూర్స్, ఉత్తమ నోడల్ శిక్షణా సంస్థలకు అవార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఏఎప్ డబ్ల్యూ డైరెక్టర్ సజీత్‌కుమార్ కున్హలత్, నాబార్డ్ జనరల్ మేనేజర్ శ్రీమతి నివేదిత తివారీ, పలువురు సీనియర్ శాస్త్రవేత్తలు,అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఉద్యోగి ఆత్మహత్య

శంషాబాద్: రైలు కిందపడి ప్రైవేటు ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. బృందావన్ కాలనీలో నివాసముంటున్న విష్ణు(32) ఆదివారం ఉదయం ఉందానగర్ రైల్వే స్టేషన్ నుంచి బుద్వేల్ రైల్వేస్టేషన్ మార్గంలోని పట్టాలపై రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం



మైలార్‌దేవ్‌పల్లి: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు బండ్లగూడ ఆలీనగర్‌లో గుర్తు తెలియని వ్యక్తి 38-40 సంవత్సరాలు రోడ్డుపై పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించిన పోలీసులు అతను అప్పటికే మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. స్థానికంగా భిక్షాటన చేస్తూ జీవిస్తుంటాడని స్థానికులు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహిళ బలవన్మరణం



సుమలత మృతదేహం

రాజేంద్రనగర్: మానసిక సమస్యలతో బాధపడుతున్న ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. ఎస్సై మౌనిక కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గోదావరి జిల్లాకు చెందిన డి.వెంకటరాజు, డి.సుమలత(32) దంపతులు నగరానికి వలస వచ్చి బుద్వేల్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. ఈ నెల 13న గ్రామంలోని తల్లికి ఆరోగ్యం బాగాలేదని తెలియడంతో అతను తన మేనల్లుడిని భార్యకు తోడుగా ఉంచి గ్రామానికి వెళ్లాడు. 15న తెల్లవారుజామున తిరిగి వచ్చిన అతను ఇంటి తలుపు తట్టగా మేనల్లుడు తలుపు తీశాడు. బెడ్‌రూమ్ లోనుంచి భార్య బయటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన అతను గదిలోకి వెళ్లి చూడగా ఆమె ఉరి వేసుకుని కనిపించింది. గత కొన్ని రోజులుగా మానసిక సమస్యతో బాధపడుతున్న ఆమె అందుకు సంబంధించి చికిత్స పొందుతోంది. భర్త ఇంట్లో లేని సమయంలో ఈ సంఘటనకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి మహాపడి పూజ



మహాపడి పూజలో పాల్గొన్న మేయర్ మహేందర్‌గౌడ్, కుటుంబ సభ్యులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విజయ గణపతి దేవాలయంలో అయ్యప్ప స్వామి మహాపడి పూజ సోమవారం వైభవంగా జరిగింది. అయ్యప్ప నామస్మరణతో సన్‌సిటి విజయగణపతి దేవాలయ మారుమోగింది. మహాపడి పూజకు కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి హాజరై పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో అయ్యప్ప స్వాములు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు బండ్లగూడ జీఆర్‌కే గార్డెన్‌లో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. శంషాబాద్, రాజేంద్రనగర్, గండిపేట మండలాలకు చెందిన పార్టీ ముఖ్య నాయకులంతా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

వెంటాడి గొంతు కోసేశారు..

తమ అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడనే కోపంతో యువతి కుటుంబసభ్యుల ఘాతుకం

లంగర్‌హౌస్: బావ మరదళ్లు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఈ వివాహం నచ్చని అమ్మాయి కుటుంబీకులు తమ అమ్మాయినే చంపి, వేధించి చంపారని ఆ నేరం ఆమె అత్త, భర్త, కుటుంబీకులపై నెట్టాలనుకున్నారు. విషయం తెలుసుకున్న భర్త మాట్లాడటానికి రావడంతో నడిరోడ్డుపై వెంటాడి గొంతు కోసి చంపిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. చెంగిచెర్లలో ఉంటూ రిలియన్స్ రిటైల్ స్టోర్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న కలీం, గోల్కొండ సబ్జా కాలనీలో నివాసముండే మరదలు ప్రేమించుకున్నారు. వీరి ప్రేమను తిరస్కరించిన అమ్మాయి కుటుంబీకులు ఆమె మరో మేనత్త కుమారుడితో మార్చిలో వివాహం చేయడానికి నిశ్చయించారు. వివాహ కొనుగోళ్ల కోసం పెళ్లికి 4 రోజుల ముందు కుటుంబసభ్యులందరూ షాపింగ్ వెళ్లగా కలీం ఆమెను ముంబై తీసుకెళ్లి వివాహం చేసుకుని నెల తర్వాత నగరానికి వచ్చారు. ఈ క్రమంలో కలీం కుటుంబసభ్యులను అమ్మాయి తరఫున బంధువులు పలుమార్లు వేధింపులకు గురి చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా బాలిక తండ్రి అహ్మద్‌తో పాటు ఇద్దరు కుమారులు, మరో వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చారు. కేసు విత్‌డ్రా చేసుకోవాలని కలీం ద్వారా అతని అన్న మామను అడగగా వారు ఒప్పుకోలేదు. కక్ష పెంచుకున్న అమ్మాయి కుటుంబీకులు కలిసి ఉందామని నటిస్తూ అబ్బాయి కుటుంబీకులతో కలిసి ఉన్నారు. 45 రోజుల క్రితం అమ్మాయిని గోల్కొండలోని తమ ఇంటికి తీసుకెళ్లారు. కలీంను వదిలేయాలని కుటుంబీకులతో పాటు గతంలో ఆమెతో వివాహం నిశ్చయమైన వ్యక్తితో వేధిస్తున్నారు. వారం క్రితం అమ్మాయిని భర్త వద్దకు పంపి అక్కడే ఆమెను హత్య చేసి అత్తింటిపై నెట్టి హత్య చేశారని చెప్పి జైలుకు పంపాలనుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కలీం భార్య వేరొకరి ఫోన్‌తో ఈ విషయాన్ని భర్తకు వాయిస్ మెస్సేజ్ ద్వారా తెలియజేసింది. ఐదు రోజుల క్రితం గోల్కొండ పోలీసులను సంప్రదించగా వారిద్దరూ వేరు కాపురం పెడితే తాము ఒప్పుకుంటామని పోలీసుల ముందు అమ్మాయి కుటుంబీకులు చెప్పగా కలీం ఒప్పుకున్నాడు.

అద్దె గది చూపిస్తామని పిలిపించి..

తమ తల్లికి సర్జరీ అయ్యిందని, ఆమె మేడిపల్లిలోని ఆస్పత్రిలో ఉందని ఆమె బయటకు రాగానే చెప్పి తాము వేరు కాపురం పెడతామని కలీం ఆ అమ్మాయి కుటుంబీకులకు చెప్పాడు. తమ ప్రాంతంలోనే గది చూసామని నచ్చితే వచ్చి చూసి వెళ్లాలని ఆదివారం రాత్రి గోల్కొండకు రావాలని ఫోన్ చేశారు. 10 గంటలకు ఎండిలైన్స్ చేరుకున్న కలీంతో గొడవపడి అందరు చూస్తుండగా రోడ్డుపై వెంటాడి ముగ్గురు వ్యక్తులు కలీం గొంతు కోసి హత్య చేశారు. నిందితులు గోల్కొండ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం.

ప్లాస్టిక్ గోదాములో అగ్ని ప్రమాదం



చెలరేగుతున్న మంటలు

మైలార్‌దేవ్‌పల్లి: షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ప్లాస్టిక్ గోదాంలో మంటలు చెలరేగి అగ్నికి ఆహుతైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. మైలార్‌దేవ్‌పల్లి ఎస్సై వాకిటి రాజశేఖర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆరాంఘర్ చౌరస్తాలోని గ్రీన్ బవార్చి హోటల్ వెనుక శ్రీసాయి ప్లాస్టిక్స్ గోదాము కొనసాగుతోంది. సోమవారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. సంక్రాంతి

మణికొండ: మూడు రోజుల పాటు సంక్రాంతి పండగను గండిపేట మండలం, మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల ప్రజలు ఉల్లాసంగా..ఉత్సాహంగా జరుపుకున్నారు. మొదటి రోజు భోగి ఉత్సవాలతో ప్రారంభమైన పండగ రెండవ రోజు ఆదివారం సంక్రాంతి, సోమవారం కనుమతో ముగిశాయి. ఉదయం నుంచే రంగవల్లులతో శోభాయమానంగా ముంగిళ్లలను తీర్చిదిద్దుకున్నారు. ఇష్టదైవాల పూజలు, దేవాలయాల సందర్శనలతో పాటు పండగకు వచ్చిన బంధు మిత్రులతో పసందైన వంటకాలతో భోజనాలు చేశారు. గాలి పటాలను ఎగరవేశారు. కొందరు తమ స్వస్థలాల్లో పండగను జరుపుకునేందుకు పల్లెబాట పట్టడంతో ప్రధాన రోడ్లు బోసిపోయాయి. స్థానికంగా ఉండే వారి ఆహ్వానం మేరకు పండగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించే కోడి పందాలను తిలకించటం, వారు ఇచ్చే ఆతిథ్యాన్ని స్వీకరించేందుకు పలువురు రాజకీయ నాయకులు ఆ రాష్ట్ర బాట పట్టారు.



పతంగులను ఎగురవేస్తున్న కౌన్సిలర్ ఉషారాణి

శంషాబాద్ పట్టణంలో..

పట్టణంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. రంగవల్లులతో వీధులను తీర్చిదిద్దారు. గాలిపటాలను ఎగురవేస్తూ యువత సందడి చేశారు. పండగ సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆర్‌బీనగర్, మధురానగర్, సదరన్‌కాలనీ, ఊటిపల్లి, తొండుపల్లి తదితర ప్రాంతాల్లో యువత సాముహికంగా గాలిపటాలు ఎగరవేశారు.



సదరన్ కాలనీలో చిన్నారి సందడి



మంచిరేవులలో గాలిపటాలను ఎగురవేస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రవీణ్‌యాదవ్, రమేష్



ఖానాపూర్‌లో పతంగులు ఎగురవేస్తున్న పెద్దలు, పిల్లలు